ఆనంద్‌నగర్- బండ్లగూడ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి


ఆనంద్‌నగర్‌లో రోడ్డు పనులు పరిశీలిస్తున్న డీసీ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్ అరుణ


నాగోలు శ్మశాన వాటికను పరిశీలిస్తున్న డీసీ తిప్పర్తి యాదయ్య

నాగోలు: బండ్లగూడ నుంచి ఆనంద్‌నగర్ తాజా హోటల్ వరకు రోడ్ల పనులు త్వరగా ప్రారంభించాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ కోరారు. హయత్‌నగర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ యాదయ్యతో కలిసి నాగోలు డివిజన్‌లోని వివిధ కాలనీల్లో శుక్రవారం పర్యటించారు. ముందుగా ఆనంద్‌నగర్ రోడ్డును పరిశీలించారు. గుంతలమయంగా మారిన రోడ్లతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ రమేశ్ బాబు, ఏఈ రాకేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగోలు శ్మశాన వాటిక పరిశీలన..

నాగోలు శ్మశాన వాటికలో రజకుల సమాధులను టార్గెట్ చేసి ధ్వంసం చేశారని నాగోలు రజక సంఘం నాయకులు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, అధికారులు శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రజక చేతి వృత్తి దారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, ఇతర రజక సంఘం నాయకులు మాట్లాడుతూ నాగోలులో అభివృద్ధి పనుల పేరుతో శ్మశాన వాటికలోని సమాధులను కూల్చివేస్తున్నారన్నారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒక్క సామాజిక వర్గం వారు ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందిస్తూ ప్రజల అవసరాల నిమిత్తం ఎక్కడ ఖాళీ ఉండే అక్కడే కడుతామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు


అష్టలక్ష్మి అమ్మవారు

శ్రావణమాస మూడో శుక్రవారం సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామికి అభిషేకం, అలంకరణ, అష్టలక్ష్మి అమ్మవారికి లక్ష పుష్పార్చన, శ్రీలక్ష్మీ నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. –దిల్‌సుఖ్‌నగర్


దర్శనం కోసం క్యూలో భక్తులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

25న హైందవ భక్తి కళా సమ్మేళనం


మాట్లాడుతున్న అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి

వనస్థలిపురం: ఈనెల 25న హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించనున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి అన్నారు. వనస్థలిపురంలోని వినాయక నాట్యమండలి (సురభి) ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాట్యం, వాయిద్యం, సామూహిక భజనలు, కోలాటాలు, చిందు, యక్షగానం, ఒగ్గుకథలు, ఇలా వివిధ కళారూపాల ద్వారా భక్తి తత్వాన్ని వ్యాప్తి చేస్తున్న కళాకారులు, కళా గురువులను సన్మానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎందరో కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శిస్తారని తెలిపారు. వినాయక నాట్యమండలి నిర్వాహకులు వేణుగోపాల్, జైభారత్ జాతీయ నాయకులు శేషు, బీవీరెడ్డి, మల్లికావల్లభ, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 24న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాయిరాం నగర్, ఆర్‌టీసీ, ప్రెస్ కాలనీ, భానునగర్, వైశాలీనగర్, సింగరేణి, చంపాపేట కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రైతు బజార్‌ల్లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరల వివరాలు. టమాటా రూ.19, వంకాయ రూ.28, బెండ రూ.23, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.23, క్యాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.17, క్యారెట్ రూ.45, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.49, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.40, అర్వి రూ.40, మునగ రూ.35, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.25, బీన్స్ రూ.65, క్యాప్సికం రూ.50.ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలి


హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల

సైదాబాద్: యువత ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా స్వయం ఉపాధి అవకాశాలను కల్పించుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని భోజరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన వారాహి భవన్ హోటల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందుబాటులో ధరల్లోనే నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. హోటల్ వ్యాపారాన్ని ప్రారంభించిన దివ్యవాణి, మధు దంపతులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పేరాల శేఖర్, కార్పొరేటర్లు జంగం శ్వేత, కొత్తకాపు అరుణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్ రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ పాల్గొన్నారు.

సకలఫల అలంకరణలో అమ్మవారు



మన్సూరాబాద్: శ్రావణమాస శుక్రవారాన్ని పురస్కరించుకుని నాగోలు డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో దుర్గామాతను (సకలఫల) అన్ని ఫలాలతో అలంకరించారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆల య కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రవి, మురళి, రమణమూర్తి, రమేశ్, అజయ్, కృష్ణమూర్తి, అశోక్, సత్తిరెడ్డి, అర్చకులు బాలమురళీ కృష్ణశర్మ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతీలాల్ సుభాష్


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ కాంతీలాల్ సుభాష్

సైదాబాద్: ఉత్సవాలు, వేడుకల సమయాల్లో ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతీలాల్ సుభాష్ పేర్కొన్నారు. సైదాబాద్‌లోని జోన్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న గణేశ్ నవరాత్రులు, నిమజ్జన ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో ముగిసే వరకు అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ స్వామి, జోన్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న, జీహెచ్‌ఎంసీ ఇతర అధికారులు, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, వాటర్‌వర్క్స్, టీజీఆర్టీసీ, ఆర్టీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన దర్గా ఉత్సవాలు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మన్సూరాబాద్: చింతలకుంటలోని విజయవాడ జాతీయ రహదారికి పక్కనున్న హజ్రత్ అబ్దుల్ ఖాదీర్ షాహెద్ దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి.429 సంవత్సరాల చరిత్ర ఉన్న అతిపురాతనమైన దర్గా ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారని నిర్వహకుడు ముతావలి సయ్యద్ పాష తెలిపారు. రెండో రోజు శుక్రవారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇమామ్ ఖాసీం, ఖాజాపాష, సయ్యద్‌పాష, సయ్యద్ అన్వర్‌పాష, సయ్యద్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: అన్ని డివిజన్లలో సీసీరోడ్లతో పాటు బీటీరోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు వేగంగా జరుగుతున్నాయని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ అన్నపూర్ణనగర్, శ్రీవిద్యాటౌన్‌షిప్ కాలనీల్లో ఆమె సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన


మేళాలో దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు విశేష స్పందన లభిస్తోంది. ప్రజలు దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లు చేస్తున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నోచికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరల్లో లభిస్తాయని మేళా నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు. ప్రవేశం ఉచితమని, ఈ అవకాశం మూడు రోజులు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.

కాలనీల్లో పెట్రోలింగ్ పెంచాలి

చైతన్యపురి: కాలనీల్లో పెట్రోలింగ్ పెంచాలని గడ్డిఅన్నారం డివిజన్ గౌతంనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి వేళల్లో కొందరు దుండగులు ఇండ్ల ప్రహరీ దూకి లోనికి వచ్చి మ్యాన్‌హోళ్ల మూతలు దొంగిలిస్తున్నారన్నారు. అలాగే ప్రైవేట్ హాస్టల్స్‌కు చెందిన యువతి యువకులు అర్ధరాత్రి వేళ రోడ్లపక్కన ఫుట్‌పాత్‌లపై కూర్చొని న్యూసెన్స్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గౌతంనగర్ కాలనీ అధ్యక్షుడు కళ్లెం మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణగౌడ్, న్యూగడ్డిఅన్నారం అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేది అధికార దాహం

- ఇక్కడ గెలిచి.. అక్కడి వారి కోసం పోరాటమా?
- సబితకు మహేశ్వరం ప్రజలపై ప్రేమలేదు
- సబితారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ మండిపాటు



మహేశ్వరం: ఎమ్మెల్యే సబితారెడ్డికి అధికార దాహమే తప్ప నియోజకవర్గ ప్రజలపై ప్రేమ లేదని మా జీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయ న మాట్లాడారు. ఎమ్మెల్యే సబితారెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలుపొంది, చేవెళ్ల రైతుల కోసం పోరా టం చేస్తుందని విమర్శించారు. రైతుల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నేతలు ఎవరి నియోజకవర్గా ల్లో వారు ధర్నాలు చేస్తే, సబితారెడ్డి మాత్రం మహేశ్వరంలో ధర్నా చేయకుండా చేవెళ్లలో కూర్చున్నా రని ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రజలతో అధికారం చే ప ట్టిన ఆమె.. పక్క నియోజకవర్గంలో నిరసన వ్య క్తం చేయడమేంటని ప్రశ్నించారు. కేఎల్‌ఆర్ భయానికి ఆమె నియోజకవర్గం మారనుందన్న అనుమా నం వస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముచ్చర్ల ఫో ర్త్‌సిటీ ఇన్‌చార్జిగా తనను ప్రకటిస్తే సబిత జీర్ణించు కోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఆమెను ఇక్కడి ప్రజలు చేవెళ్లకు పంపిస్తారని వెల్లడించారు.

27న పిల్లల ఉపకరణాల కోసం శిబిరం

మల్కాజిగిరి: వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో చదువుతున్న విద్యార్థులతోపాటు ఇతర చిన్నారులు ప్రత్యేక అవసరాలు (సీడబ్ల్యుఎస్‌ఎన్) గల వారికి ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 27వ తేదీ మల్కాజిగిరిలోని బాలుర పాఠశాలలో గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డు, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్, ఇతర డాక్టర్ సర్టిఫికెట్స్‌తో పిల్లలను తీసుకొని తల్లితండ్రులు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9492693431, 9392909770లో సంప్రదించాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. దీనికి సంబంధించి తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడునెలల పాటుగా సెట్విన్ పాఠ్యాంశాల ఆధారంగా కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ అర్హతగా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు కుషాయిగూడలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు. ఇతర వివరాల కోసం 94912 30181 ఫోన్ నెంబరు అందుబాటులో ఉంటుందన్నారు.

పీఓడబ్ల్యూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు

వనస్థలిపురం: ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఏడో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను వనస్థలిపురంలోని యువ బాలికల డిఫెన్స్ కళాశాలలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనసూయ మాట్లాడుతు ఆకాశంలో సగమైన మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో కలబడి నిలబడాలని, సకల వివక్షతలను ప్రతిఘటించాలని అన్నారు. రాబోయే నూతన సమాజ ఆవిష్కరణలో మహిళలు కీలక భూమిక పోషించాలని, సమాన హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కళాశాల డైరెక్టర్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కట్టా భగవంతరెడ్డి, విశ్రాంత బీసీ ఉప కమిషనర్ బాలచందర్, ప్రేమలత, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ధర్నాలో రాజకీయ నిరుద్యోగులే

మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన రైతు ధర్నాలో బీఆర్‌ఎస్ రాజకీయ నిరుద్యోగులే తప్పా రైతులు పాల్గొనలేదని మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులకు 10 ఏళ్ల రైతులు గుర్తుకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే కేటీఆర్‌కు రైతులు గుర్తొచ్చారని విమర్శించారు. రైతు రుణాలను రూ.2లక్షల వరకు తప్పకుండా ఏకకాలంలో మాఫీ చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని హామీలను పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రామిడి కృష్ణారెడ్డి, సోనునాయక్, వెంకటేష్‌గౌడ్, రామేష్‌నాయక్, నవీన్, నరేష్, జంగయ్యగౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ రింగ్ రోడ్డులో వాహనాల తనిఖీ


ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న డీసీపీ మనోహర్, అధికారులు

ఉప్పల్: ప్రతీ వాహనదారుడు విధిగా తన వాహనానికి సంబంధించిన పూర్తి పత్రాలు తన వద్ద ఉంచుకోవాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేయనున్నట్లు డీసీపి-1 మనోహర్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉప్పల్ రింగ్ రోడ్డులో మల్కాజిగిరి ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ మాధవి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్‌లతో కలిసి వాహనాల డాక్యుమెంట్లను చెక్ చేశారు. దాదాపుగా 150 వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలకు ఫైన్ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. రఘురాం, ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ విషయంలో గొడవ..

- భార్యభర్తలను చితకబాదిన దుండగులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

లింగోజిగూడ: పార్కింగ్ విషయంలో జరిగిన గొడవలో భార్యభర్తలను చితకబాదిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలోని సాయినగర్‌కాలనీలో నవీన్, సీతారెడ్డి నివసిస్తున్నారు. సీతారెడ్డి ఇంట్లో జరిగిన శుభకార్యానికి బంధువులు వచ్చారు. వారి వాహనాలను పక్కనే ఉన్న నవీన్ ఇంటి ఎదుట పార్కింగ్ చేస్తుండగా నిలపవద్దని నవీన్ వారితో వాగ్వాదానికి దిగాడు. సీతారెడ్డి బంధువులు నవన్ మధ్య వాగ్వాదం పెరగడంతో నవీన్ సీతారెడ్డి బంధువుపై చేయిచేసుకున్నాడు. దీంతో సీతారెడ్డి బంధువులు నవీన్‌ను అతని భార్యను చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల ఎదుటే దుండగులు భార్యభర్తను చితకబాదారు. నవీన్ ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ


అల్పాహారం అందజేస్తున్న గీతారెడ్డి, తదితరులు

మన్సూరాబాద్: రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ చౌరస్తాలో శుక్రవారం అల్పాహారం పంపిణీ చేశారు. బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అల్పాహారాన్ని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫౌండేషన్ ఫౌండర్ శంకర్ బర్త్‌డే పురస్కరించుకుని 100 రోజుల పాటు 100 మందికి ఉచితంగా అల్పాహారం అందిస్తానని పేర్కొని 14 రోజులుగా చేపడుతుండటం అభినందనీయమన్నారు. 150 మంది వరకు బ్రేక్‌ఫాస్ట్‌ను అందించినట్లు ఫౌండేషన్ ఫౌండర్ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో యువత కమిటీ అధ్యక్షుడు శివనేత, కో ఆర్డినేటర్ ప్రవీణ్, అఖిల్, శ్రీను, వెంకటేశ్, శ్రీనాథ్, సాయి పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- 15 రోజుల్లో 122 మంది ఈవ్‌టీజర్లు అదుపులోకి

నాగోలు: విద్యార్థినులు, బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు హెచ్చరించారు. కమిషనరేట్ షీ టీమ్స్ పట్టుకున్న ఈవ్‌టీజర్లకు రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళలు, యువతులను వేధిస్తున్న 122 మందిని షీ టీమ్స్ పట్టుకున్నాయన్నారు. బస్టాండ్లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నాయని, పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నామని, అలాగే వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారని తెలిపారు. ఈ నెల 1 నుంచి 15 వరకు 169 ఫిర్యాదులు రాగా విచారణ చేపట్టి దర్యాప్తు పూర్తి చేశామని రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఇందులో ఫోన్లో వేధించినవి -24 సోషల్ మీడియా ద్వారా - 37 నేరుగా - 108 వాటిలో క్రిమినల్ కేసులు-13 , పెట్టీ కేసులు- 52 ఉండగా మరో 68 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి రోడ్డు మీద వెళ్తున్న మహిళలు, ఆడపిల్లలను వేధిస్తున్న 116 మంది పోకిరీలను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చామని పేర్కొన్నారు. మహిళలు వేధింపులకు గురైతే వెంటనే షీ టీమ్స్ రాచకొండ వాట్సప్ నెంబర్ 8712662111కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.


ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

లింగోజిగూడ: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ కాప్రా ఈసీఐఎల్‌కు చెందిన ఎస్ విజయలక్ష్మి (47) గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పెద్దఅంబర్‌పేట వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయలైన విజయలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవర్ వంకపూరి బలరామ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

మరొక ఘటనలో..

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపురం చెందిన ఎస్ మహేశ్ (27) బైక్‌పై నగరం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. హయత్‌నగర్ లక్ష్మారెడ్డిపాలెం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడగా మహేశ్ గాయపడ్డాడు. వెంటనే హయత్‌నగర్‌లోని నీలాద్రి హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు రెండు ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లకు వారి కేంద్రానికి సంబంధించి ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తినేలా ప్రోత్సహించాలని, పిల్లల హాజరు శాతం పెంచాలని, ప్రీ స్కూల్ మెటీరియల్‌ను చిన్నారులకు అందజేయాలని సూచించారు. పట్టిక ప్రకారం పిల్లల బరువు, ఎత్తు కొలవాలని చెప్పారు. అంతకు ముందు పూర్వ ప్రాథమిక విద్య, టైమ్ టెబుల్‌ను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ అధికారి డా.మల్లికార్జున్, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలోని వాయిస్ ఆఫ్ ఇమ్మానుయెల్ ప్రార్థన మందిర ఆవరణలో శుక్రవారం క్రిస్టియన్ తెలంగాణ జేఏసీ రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను రాష్ట్ర చైర్మన్ రవికుమార్, ఉమ్మడి జిల్లా చైర్మన్ రమేష్‌లు ఆవిష్కరించారు. జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జేఏసీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ ఫలాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జేఏసీ కన్వీనర్ సీహెచ్ జాన్, జిల్లా కోఆర్డినేటర్ ఎదురుగుట్ల ఆనందరావు, పాస్టర్ పాల్, బ్రదర్ లింగస్వామి, బ్రదర్ ప్రేమ్‌కుమార్, సిస్టర్ జయ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

మీర్‌పేట: ఆపదలో ఉన్న నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ ఓల్డ్ బాలాజీనగర్‌కు చెందిన శ్యామ్‌రావు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు లక్షల్లో డబ్బు కావాల్సి ఉంది. దీంతో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు బాలకిషన్ ద్వారా ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా.. సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల 50 వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శుక్రవారం ఎల్‌ఓసీ పత్రాన్ని శ్యామ్‌రావుకు ఎమ్మెల్సీ అందజేశారు.